12 రకాల ఉచిత వైద్య సేవలు

ముషీరాబాద్ యూపీహెచ్‌సీ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి

ఇంటర్వ్యూ...



రాంనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి సూచించారు. ముషీరాబాద్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు 12 రకాల ఉచిత వైద్య సేవలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా గర్భిణులకు సేవలు, నవజాత శిశువు, శివు ఆరోగ్య సేవలు, పిల్లల కోసం బాల్య మరియు శిశు ఆరోగ్యసేవలు, సాధారణ కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక, పునరుత్పత్తి ఆరోగ్య సేవలు తదితర ఆరోగ్య సంరక్షణ సేవలు. అత్యవసర వైద్య సేవలను ప్రతీరోజు ముషీరాబాద్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్నట్లు డాక్టర్ మనోజ్ రెడ్డి తెలిపారు. అందిస్తున్న సేవల గురించి 'ఆంధ్రజ్యోతి'తో తె లిపారు.

ముషీరాబాద్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవల వివరాలు ఏవి?

తమ సెంటర్‌లో జ్వరం, దగ్గు, జలుబు, వాంతులు, విరేచనాలు, చెవినొప్పి, తలనొప్పి, బాడీ నొప్పులు, బీపీ, బ్యాక్‌పెయిన్ కీళ్లనొప్పులు షుగర్ వంటి వాటికి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓపీ పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులను ఉచితంగా అందజేస్తాం.

గర్భిణుల కోసం ఎలాంటి సేవలు లభిస్తాయి?

గర్భిణులకు తొమ్మిది నెలల పాటు ప్రతీనెలా పరీక్షలు నిర్వహించి నెలవారిగా మందులు. ఇంజక్షన్లు ఇతర పోషక టాబ్లెట్లు ఇవ్వడం జరుగుతుంది. డెలివరీ ఇక్కడ కావాలనుకునే వారిని ప్రత్యేక వాహనంలో గాంధీ, కోటి మెటర్నిటీ, కింగ్‌కోటీ మెటర్నిటీ ఆసుపత్రులకు తీసుకెళ్లి ప్రసవం అయిన తరువాత ఇంటికి చేర్చుతాం.

పిల్లలకు ఏయే వైద్య సేవలు అందుతున్నాయి?

పిల్లలకు ఇక్కడ అన్ని రకాల టీకాలు ఇవ్వడం జరుగుతుంది. ముఖ్యంగా డీపీటీ, బీసీజీ, హెపటైటిస్ బీ, టిడి, పెంటా, జనరల్ పోలియో, జేఈ, పీసీఎల్, ఎఫ్ఐ పిఎల్ టీకాలతో పాటు డీప్తీరియా సేవలు కూడా ఇక్కడ అందిస్తున్నాం.

రక్త పరీక్షల రిపోర్టు ఇవ్వడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నిజమేనా?

ప్రజలకు ల్యాబ్ సేవలు రక్త పరీక్షల గురించి రిపోర్టులను టెస్టులను బట్టి 24 గంటలు లేదా 48 గంటల్లో ఇవ్వడం జరుగుతుంది. టెస్టులకు సంబంధించి రిపోర్టులను వారి ఫోన్‌లో మేజేస్‌పంపడంతో ప్రింట్ ఔట్లు కూడా సెంటర్‌లో ఇవ్వడం జరుగుతుంది,. ప్రింట్ అవుట్లు ఇవ్వడం లేదన్న వాదనలు నిజం కాదు.

గోల్నాకలో ట్రాఫిక్ ఇబ్బందులు

- ఆరేళ్లుగా కొనసాగుతున్న అంబర్‌పేట ఫ్లై ఓవర్ పనులు
- మరోవైపు మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం

గోల్నాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోల్నాక చర్చి నుంచి చే నెంబర్ చౌరస్తా గుండా శ్రీరమణ చౌరస్తా ద్వారా అంబర్‌పేట ముక్రమ్ హోటల్ వరకు చేపడుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. పనులు నత్తనడకన కొనసాగుతుండంతో గోల్నాకలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నాయి. ఫలితంగా ప్రజలు, వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పుడు మూసారాంబాగ్ వద్ద మూసీనదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతుండడంతో దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే రోడ్డు కూడా మూసివేసి మూసారాంబాగ్ పెట్రోల్ పంప్ నుంచి గోల్నాక కొత్త బ్రిడ్జి ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. ఫలితంగా గోల్నాకలో ట్రాఫిక్‌తో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కిలోమీటరన్నర ఫ్లై ఓవర్ నిర్మాణం పనులు ఆరేళ్లుగా కొనసాగుతుండడంతో ప్రజలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆ బ్రిడ్జి నిర్మాణం పూర్తయేదెప్పుడో...



అంబర్‌పేట సీపీఎల్ రోడ్డు పక్కన నిలిపిన వాహనాలు

● ట్రాఫిక్ కష్టాలు

ఈ రెండు బ్రిడ్జిల నిర్మాణం పూర్తయేదాకా గోల్నాకవాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పేట్టు లేవు. 2018 మే 5వ తేదీన అప్పటి కేంద్రమంత్రి నితిన్ గడ్కరి ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఏడాదిన్నర వరకు రోడ్డు విస్తరణ పనులను ప్రారంభం కాలేదు. ఆపై పనులను ప్రారంభించి నాలుగున్నరేళ్లు అయినా ఇంకా ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తికాకపోవడంతో అంబర్‌పేట, గోల్నాకవాసులు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. ఫ్లై ఓవర్ నిర్మాణంతో అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా నుంచి రోడ్డును బంద్ చేసి అలీకేఫ్ గుండా గోల్నాక ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించడంతో గోల్నాక ప్రాంతం ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ఇరుకైన రోడ్లు, అస్తవ్యస్తమైన ట్రాఫిక్ వ్యవస్థతో భారీగా వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ ట్రాఫిక్‌తో కిక్కిరిసి పోతున్నాయి. కనీసం పాదాచారులు నడవడం కూడా ఇబ్బందిగా మారింది. ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నా రోడ్డుకిరుపైపులా టిఫిన్ సెంటర్లు, టీ-స్టాల్స్ నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత సమస్యగా మారింది. ఇలాంటి వాటిని తొలగించాల్సిన ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి కావడానికి ఇంకా ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ సమస్యలు చూసి ప్రజలు రోడ్డు ఎక్కాలంటే భయపడుతున్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేసి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



అంబర్‌పేట సీపీఎల్‌రోడ్‌లో ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయం ఎదురుగా వాహనాల అక్రమ పార్కింగ్

ముషీరాబాద్‌లో ఘనంగా సదర్ సంబరాలు

హాజరైన మాజీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, మండలి ప్రతిపక్షనేత మధుసూదనచారి

ముషీరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సదర్ వేడుకలు ముషీరాబాద్‌లో అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హరియాణా, పంజాబ్, గుజరాత్ నుంచి తీసుకొచ్చిన గోలు, షేర్, శ్రీకృష్ణ, విదాయక్, రాజా, తదితర 9 భారీ దున్నలను సదర్ వేడుకల్లో నగరవాసులను అలరించాయి. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనచారి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్‌అలీ, ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ బడుగు లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, సీఐ రాంబాబు, సుప్రీం కోర్టు న్యాయవాది ఏ.వి.రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఎడ్ల హరిబాబుయాదవ్ ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సదర్ వేడుకలకు రూ.కోటి 50 లక్షలు ప్రకటించడం అభినందనీయమన్నారు. సదర్ వేడుకలను ప్రతియేట ఎడ్ల హరిబాబుయాదవ్, కుటుంబసభ్యులు పెద్దఎత్తున నిర్వహిస్తూ యాదవుల్లో ఐక్యత, సదరు వేడుకలను ఇతర రాష్ట్రాలకు సైతం ప్రతీకగా నిలిచేలా నిర్వహిస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వరుణ్, అభినందన్‌యాదవ్, సాయి, శ్రీధర్‌చారి, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, ఎయిర్‌టెల్‌రాజు, జి.రాజు పాల్గొన్నారు.



సదర్ వేడుకల్లో మధుసూదనచారి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బడుగు లింగయ్య యాదవ్ తదితరులు

బాలరత్న అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతికి నిర్వహించే బాలల దినోత్సవం సందర్భంగా ప్రదానం చేసే బాలరత్న అవార్డుల కోసం వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న బాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమలాకర మెమోరియల్ చారిటబుల్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భారతికమలాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లలోపు చిన్నారులకు ఈ అవార్డులు అందజేస్తామన్నారు. ఈనెల 19న జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమం సందర్భంగా ఆసక్తి గల చిన్నారులు తమ దరఖాస్తులను 10వ తేదీలోగా పంపాలని కోరారు. వివరాల కోసం 7675955208, 8309281780 (వాట్సాప్) 86395 74095 (రంగనాథ్)లో సంప్రదించాలని వారు కోరారు.



మాదిగల సమావేశంలో మాట్లాడుతున్న గోవింద్ నరేష్ మాదిగ

ఎస్సీ వర్గీకరణ చేశాకే ఉద్యోగాలు భర్తీ చేయాలి

ముషీరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం మాదిగలకు ద్రోహం చేసినట్లే అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ పేర్కొన్నారు. శనివారం ముషీరాబాద్‌లోని భారత్ సేవా సమాజ్ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగల ధర్మ యుద్ధ సన్నాహ సదస్సుకు నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోవిందనరేష్ మాట్లాడుతూ.. సీఎం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీని విస్మరించారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 6వ తేదీన ఖైరతాబాద్‌లో గల మోడ్రన్ ఫంక్షన్‌హాల్‌లో మాదిగల ధర్మయుద్ధం మహాసభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ముషీరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ గంగపుత్రకాలనీలో వారం రోజులుగా మురుగునీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. అధికారులు పట్టించుకోవడం లేదని ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ ఆరోపించారు. శనివారం ప్రజల ఫిర్యాదు మేరకు గంగపుత్ర కాలనీని సందర్శించి జలమండలి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రోడ్డుపై మురుగునీరు ప్రవహించడం వల్ల తీవ్ర దుర్గంధం వెలువడుతుంది.



గంగపుత్ర కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు



భవాని శంకర దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రారంభమైన కార్తీక మాస మహోత్సవాలు

ముషీరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ దోభీతోటలోని భవానీ శంకర దేవాలయంలో శనివారం కార్తిక మాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈవో జ్యోతి మాట్లాడుతూ... నెల రోజుల పాటు వివిధ రకాల పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది సురేష్, సాగర్ పాల్గొన్నారు.

మెస్ చార్జీల పెంపు అభినందనీయం

రాంనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను 40 శాతంపెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ పేర్కొన్నారు. బీసీ సంఘాల విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చిక్కడపల్లిలో బీసీ సంఘాల నేతలు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగప్ప, నాయకులు అయిలవెంకన్నగౌడ్, నీల కంఠేశ్వర్‌రావు, ఇంద్రం రజక, అర్జున్, సుమన్, నరేందర్, విద్యార్థి యువజన సంఘాల నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్సీలను విమర్శించే అర్హత కౌశిక్‌రెడ్డికి లేదు

రాంనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లను విమర్శించే నైతిక అర్హత హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి లేదని టీపీసీసీ రాష్ట్ర కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి వివి రవీంద్రనాథ్‌నాయుడు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాడి కౌశిక్‌రెడ్డి నేర చరిత్రను చూసి అప్పటి గవర్నర్ తమిళసై ఆయన ఎంపికను వెనక్కి పంపిన చరిత్రను మరిచి కౌశిక్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జన్వాడ ఫాంహౌస్‌లో కేసును తప్పుదోవ పట్టించేందుకు మాజీమంత్రి కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పాడి కౌశిక్‌రెడ్డి హుజురాబాద్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో గెలవకపోతే తాను కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని ప్రజలను బ్లాక్ మెయిల్ చేసిన చరిత్ర కౌశిక్‌రెడ్డిదని రవీంద్రనాథ్‌నాయుడు ఆరోపించారు. అనిల్ కుమార్‌యాదవ్, బల్మూరి వెంకట్‌లపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసీఆర్, కేటీఆర్‌ల మెప్పు రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. వారిద్దరి గురించి తప్పుగా మాట్లాడితే హైదరాబాద్‌లో తిరగనివ్వమని కౌశిక్‌రెడ్డిని ఆయన హెచ్చరించారు. జన్వాడ కేసులో తన బావమరిదిని తప్పించడానికి మాజీమంత్రి కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మూసి ప్రక్షాళనకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భూసేకరణ జరిగిందని, నేడు దానిని అడ్డుకునేందుకు అదేపార్టీ ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర నాయకులు డి హెచ్ ఉమేష్, సీనియర్ నాయకులు సి.రఘునందన్‌రావు, సి.సత్యనారాయణ, పి.సత్యనారాయణ, జానకి శ్రీనివాస్, వహీద్ ఉస్సేన్, నరేందర్‌రెడ్డి, కె.జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌నాయుడు తదితరులు

పైప్‌లైన్ పనులు పర్యవేక్షించిన కార్పొరేటర్

చిక్కడపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ కృపారావులేన్ నుంచి గౌతమి స్కూల్ మీదుగా ఏర్పాటు చేసిన నూతన సీవరేజీ పైప్‌లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అధికారులతో కలిసి శనివారం పర్యవేక్షించారు. వాటర్‌బోర్డ్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ శ్రీధర్ వారి సిబ్బందితో ఆమె ఈసందర్భంగా పర్యటించి చివరిదశలో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వారికి సూచించారు. పైప్‌లైన్ ఏర్పాటులో చేసిన తవ్వకాలను సరైనవిధంగా పూడ్చలేదని పాదచారులు నడవలేకపోతున్నారని స్థానికుల ద్వారా ఫిర్యాదు అందిందని కాబట్టి రోడ్డు ప్యాచ్‌వర్క్ వర్క్ కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, సంపత్‌యాదవ్, వజ్రేశ్వరి, కృష్ణ నేత, నరేష్ పాల్గొన్నారు.



అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్



విద్యార్థులతో కార్పొరేటర్ రచనశ్రీ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పేద విద్యార్థులను స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలి

కవాడిగూడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ సూచించారు. కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ గగన్‌మహల్‌లోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఉన్న పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సర్వ్ నీడి స్వచ్ఛంద సంస్థ సహకారంతో మూడు కంప్యూటర్‌లను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జి రచనశ్రీ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సేవా సంస్థలు పేద విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్వ్ నీడి వ్యవస్థాపకుడు డాక్టర్ గౌతమ్, అప్సా సంస్థ సామాజిక కార్యకర్త బొట్టు రమేష్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కూల్ స్టేట్ సెక్రటరీ సిజె అర్జున్‌కుమార్, ప్రధాన ఉపాధ్యాయురాలు మాదవి, అప్సా ప్రతినిధులు శ్రావణి, లావణ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కవితా సంపుటి మధురోహలు సమీక్షా సమావేశం

చిక్కడపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ కవి డా.ఎంకె రాము రచించిన మధురోహలు కవితా సంపుటిపై చర్చాగోష్ఠి ఉంటుందని ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్యాగరాయగానసభలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు డా.ఎల్లూరి శివారెడ్డి పాల్గొనగా సాహితీవేత్త డా.టి.గౌరీశంకర్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షుడు డా. నాళేశ్వరం శంకరం, నేటినిజం ఎడిటర్ బైస దేవదాసు, ఆదాయం పన్ను శాఖ విశ్రాంత కమిషనర్ నరసింహప్ప సంపుటిని సమీక్ష చేస్తారన్నారు. తొలుత కూచిపూడి నృత్యప్రదర్శన ఉంటుంది.



అడిక్‌మెట్ డివిజన్‌లోని సత్యనగర్ కమ్యూనిటీ హాలులో శనివారం బెంగాలీ సేవా సమితి ఆధ్వర్యంలో కాళిమాత పూజ నిర్వహించి అన్నదానం చేశారు.

-రాంనగర్, ఆంధ్రజ్యోతి

వీరన్నగుట్ట ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటన

గోల్నాక, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ వీరన్నగుట్ట మహాశివాలయం ప్రాంతంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శనివారం పర్యటించి కార్తీకమాసం పురస్కరించుకుని ఆలయం వద్ద కార్తీక మాసం కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఈ మహాశివాలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, భక్తుల రద్దీకి అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు చెప్పారు. ఆలయ ప్రాంతంలో చేపట్టాల్సిన పనుల విషయంలో అధికారులకు మార్గదర్శనం ఎమ్మెల్యే చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధానకార్యదర్శి బి.నర్సింగ్‌రావుయాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వై.బుచ్చిరెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



మహాశివాలయం ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్ తదితరులు

22, 23న పిల్లల జాతర

రాంనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వీకే)లో నిర్వహించే బాలోత్సవం 4వ పిల్లల జాతర బ్రోచర్‌ను ప్రభుత్వ మాజీ సలహాదారు, తెలంగాణ బాలోత్సవం జాతర ఆహ్వాన సంఘం చైర్మన్ డా.కేవీ రమణాచారి ఎస్‌వీకేలో శనివారం ఆవిష్కరించారు.

● శుభాకాంక్షలు



తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా నియమితులైన టీడీపీ రాష్ట్ర నాయకులు నన్నూరి నర్సిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టా రాములు, సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి వల్లాల శ్రీనివాస్ తదితరులు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

● గ్యార్వీ షరీఫ్ ఉర్సు



నారాయణరెడ్డి కాలేజీ సమీపంలో గల దర్గా వద్ద జరిగిన గ్యార్వీ షరీఫ్ ఉర్సు శనివారం నిర్వహించారు. దర్గా అధ్యక్షుడు వహీద్ అలీ, సుభాని యూసుఫ్ ఎజాజ్‌హుస్సేన్, చోటు పాషా తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

● ఉచిత డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



కేశవ స్మృతిసంవర్ధన సమితి బర్కత్‌పుర శాఖ, ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో యువతీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమం శనివారం బాగ్‌లింగంపల్లిలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేశవ స్మృతి సంవర్ధన సమితి ప్రధాన కార్యదర్శి కె.బాలయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మురళీధర్, రామచంద్ర, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

రైలు ప్రయాణికురాలి పుస్తెలతాడు చోరీ

బర్కత్‌పుర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బంగారు మంగళసూత్రాన్ని ఓ దొంగ లాక్కొని పారిపోయాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన లక్ష్మి(48) జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైల్లో కుటుంబసభ్యులతో కలిసి నగరానికి తిరుగు ప్రయాణం అయింది. సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ వద్ద రైలు ఆగగానే గుర్తుతెలియని దొంగ రైలు బోగిలోకి వచ్చి లక్ష్మి మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడు లాక్కొని పారిపోయాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

పట్టాలు దాటుతూ రైలు ఢీకొని ఇద్దరి మృతి

బర్కత్‌పుర, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పలక్‌నుమా - బుద్వేల్ రైల్వేస్టేషన్లో నడుమ(45) ఏళ్ల వయసు గల వ్యక్తి పట్టాలు దాటుతుండగా శనివారం రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

● రైలు ఢీకొని తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోజువారి కార్మికుడు శనివారం మృతి చెందాడు. ఉప్పుగూడకు చెందిన పి లక్ష్మణ్(48) వృత్తిరిత్యా రోజువారి కూలీ. గతనెల 21న ఉప్పుగూడ రైల్వేస్టేషన్ వద్ద హంద్రినివా ఎక్స్‌ప్రెస్ రైలు దిగబోతూ కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో నిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

బర్కత్‌పుర: రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొని ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కాచిగూడ అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంటకు చెందిన కవిత(40) ఇళ్లలో పని చేస్తూ జీవనం సాగిస్తుంది. శనివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో నారాయణగూడ ఫ్లై ఓవర్ చౌరస్తా వద్ద గల క్రాన్‌సిటీ కేఫ్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కవితకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని ఆస్పత్రిలో చేర్చారు. ప్రమాదానికి కారకుడైన పూల వ్యాపారి క్రాంతికుమార్‌పై కేసు నమోదు చేసి చేసినట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

'డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి'

రాంనగర్: డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి జలమండలి సెక్షన్ పరిధిలో అచ్చయ్యనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి జలమండలి అధికారులకు సూచించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు శనివారం రవిచారి అచ్చయ్యనగర్‌లో పర్యటించి సమస్యను తెలుసుకొని జలమండలి మేనేజర్ జ్యోతికి తెలియజేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్, మల్లేష్, రామకృష్ణ బస్తీవాసులు పాల్గొన్నారు.

బీసీలు తెగించి కొట్లాడి హక్కులు సాధించుకోవాలి

● మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య

బర్కత్‌పుర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీలు తెగించి కొట్లాడితేనే రాజ్యాంగ బద్ధమైన హక్కులను సాధించుకోవచ్చని మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. 76 ఏళ్లుగా బీసీలకు అన్యాయం జరుగుతోందని, ఇక ముందు కూడా అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. బీసీలు ఇకనైనా మేల్కొని అప్రమత్తంగా ఉంటూ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 5న హైదరాబాద్‌లో బీసీల మేథోమదన సదస్సు నిర్వహిస్తున్నామని, మేధావులు, లెక్చరర్లు, టీచర్లు యువత పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతంచేయాలని ఆయన కోరారు. శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. మెస్ చార్జీలను తాము డిమాండ్ చేసిన దాని కంటే ఎక్కువ పెం చడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్టళ్లలో సౌకర్యాలను మెరుగుపర్చాలని కాలే జీ విద్యార్థులకు పాకెట్ మనీ రూ.500 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రైవేట్ వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, టి సుధాకర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, జి అనంతయ్య, భాస్కర్, రాజేందర్, ఉదయ్‌నేత రవి, శివ, బాలయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య